క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ ఏపీ టైర్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ జెనీత్, దేవీహోమ్స్, మమత ఆస్పత్రి, బాచుపల్లి సిగ్నల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సీఎం, గవర్నర్‌కు కృతజ్ఞతలు



మిఠాయిలు పంచుకుంటున్న జీడిమెట్ల ఆర్టీసీ ఉద్యోగులు

జీడిమెట్ల: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ తమిళిసైకు జీడిమెట్ల ఆర్టీసీ ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. గురువారం గవర్నర్ ఆర్టీసీ బిల్లును ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు శుక్రవారం ఉదయం డిపో వద్ద ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఇన్నేళ్ల పోరాటం ఫలించినందుకు సంతోషంగా ఉందన్నారు. మిఠాయిలు పంచుకున్న వారిలో డిపో ప్రెసిడెంట్ రాపోలు గోవర్ధన్, కండక్టర్ జీఆర్‌పీ రెడ్డి, డ్రైవర్లు కండక్టర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయశ్రీ

దుండిగల్: నిత్య జీవనంలో చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. జాతీయ పోషకాహార సంబరాలను సారెగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్పందన, అంగన్‌వాడీ టీచర్ ఎస్.మంజుల, సిబ్బంది ఎం.సునీత పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి



చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ, అధికారులు

దుండిగల్: వినాయక ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చెరువులను ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మండపాల వద్ద ఏర్పాట్లు, నిమజ్జనం చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. చెరువుల వద్ద బారికేడ్లు, క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గండిమైసమ్మ–దుండిగల్ తహసీల్దార్ సుచరిత, దుండిగల్ సీఐ రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ సారా, మున్సిపల్ మేనేజర్ నర్సింహులు, రెవెన్యూ అధికారి సునంద, ఏఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూను సందర్శించిన థాయ్‌లాండ్ వర్సిటీ బృందం

ఉస్మానియా యూనివర్సిటీ: థాయ్‌లాండ్‌లోని ఉబాన్ రట్చతని ప్రభుత్వ యూనివర్సిటీకి (యూబీయూ) చెందిన 12 మంది ప్రతినిధుల బృందం శుక్రవారం ఓయూను సందర్శించారు. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులతో సమావేశమైన ఓయూలో కొనసాగుతున్న కోర్సుల వివరాలు, పాలన తీరు, పరిశోధనలు, విధి విధానాలు, విదేశీ విద్యార్థుల సౌకర్యాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

నేతల్లో జమిలి టెన్షన్

పలు కార్యక్రమాల పేరుతో వదులుతున్న చేతి చమురు

- ఎన్నికలు ఆలస్యమైతే ఇబ్బందేనని ఆవేదన
- బీఆర్ఎస్, ప్రతిపక్ష ఆశావహుల్లోనూ ఖర్చు భయం
- పండుగల నేపథ్యంలో వారిలో మరింత ఆందోళన



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు అధికార పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో రాజకీయవేడి పెంచగా.. బీఆర్ఎస్ అభ్యర్థులతో పాటు ప్రతిపక్ష పార్టీలోని ఆశావహులకు చేతి చమురు వదులుతోంది. అధికార పార్టీ ప్రకటించిన అభ్యర్థులతోపాటు ప్రతిపక్ష పార్టీలో టికెట్లు ఆశిస్తున్న నాయకులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తమ ఉనికి చాటుకోవడానికి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో జమిలి ఎన్నికలు ఉంటాయా? అనే ప్రచారం ఆ నాయకుల్లో ఆందోళన పెంచుతోంది. ఇంకా ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే కార్యక్రమాలతో భారీగా ఖర్చు అవుతోందని ఇంకా ఆలస్యమైతే తమ పరిస్థితి ఏమిటని అధికార పార్టీ అభ్యర్థులతోపాటు ప్రతిపక్ష ఆశావహులు భయంగా ఉన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు.. ఆపై వచ్చే సద్దుల బతుకమ్మ దసరా పండుగల నేపథ్యంలో ఖర్చు మరింత భారం కానుందని ఆందోళన చెందుతున్నారు.

ప్రజల మద్దతు కోసం..

ప్రజల మద్దతు కూడగట్టేందుకు వివిధ కార్యక్రమాల పేరుతో పాదయాత్రలు, సమ్మేళనాలు, డివిజన్లు/వార్డులు, గ్రామాలు, బస్తీలవారీగా అభ్యర్థులు, ఆశావహులు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. ఈ క్రమంలో వెంట తిరిగే నాయకులు, కార్యకర్తలకు రోజూ ఎంతో కొంత ఖర్చు చేయాల్సి వస్తోంది. కొందమంది నాయకులైతే ఇప్పటి నుంచే ఆత్మీయ సమావేశాలు, సభల పేరుతో విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఖర్చుకు వెనకాడకుండా జన సమీకరణలు, బల ప్రదర్శన చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిత్వాలు ఖరారు కాగా, ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టింది. చాలా నియోజకవర్గాల నుంచి ఆ పార్టీల తరఫున ముగ్గురు మించి ఆశావహులు ఉన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఆశావహుల్లో ఒకరు ఖర్చు చేస్తూ.. ముందుకు వెళ్తుంటే అదేస్థానం నుంచి టికెట్ కోసం పోటీ పడుతున్న నాయకులు తప్పనిసరిగా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాల్సి వస్తోంది. దీంతో ఎన్నికలు అలస్యమయ్యే కొద్దీ ఈ ఖర్చు మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ నేతల దూకుడు

ప్రతిపక్ష కాంగ్రెస్ ఒక్కో నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నారు. ఈ క్రమంలో అధిష్టానానికి తమ బలాన్ని చాటేందుకు పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు 43 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మేడ్చల్, ఉప్పల్ నియోజకవర్గాల్లో కీలక నేతలు టికెట్ ఆశిస్తున్నారు. మరో మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు ఎవరికి వారే తమకే అభ్యర్థిత్వం ఖరారవుతోందన్న నమ్మకంతో ద్వితీయ శ్రేణి నాయకులను సమీకరిస్తూ.. బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారుతో..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడంతో.. ప్రధానంగా మేడ్చల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి(మంత్రి), మాధవరం కృష్ణారావు సామాజిక వర్గాలవారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భోజనాలు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. బస్తీలు, వాడలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. సామూహిక భవనాలు, దేవాలయాలకు నిధులు కేటాయిస్తూ ఆయా వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తూ బలం చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

మూడింటిలో బల ప్రదర్శనే..

- కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ టికెట్ ఖరారైన సిట్టింగ్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, టికెట్ ఆశించి.. భంగపడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను కలుస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కూడా ఎవరికి వారుగా భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో భాగస్వామ్యాన్ని పంచుకోలేక ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్ తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.
- మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు టికెట్ కేటాయించినా.. మెదక్‌లో కుమారుడు రోహిత్‌కు టికెట్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో ఉన్నప్పటికీ, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.
- ఉప్పల్‌లో కూడా సిట్టింగ్ కాదని, మరో నేత బండారి లక్ష్మారెడ్డికి టికెట్ ఖరారు చేయటంతో.. ఇద్దరూ ఎవరికి వారుగా వివిధ కార్యక్రమాలతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

బీజేపీ కార్యక్రమాలు షురూ..

బీజేపీలోనూ పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకులు కూడా తమ కార్యక్రమాలను మొదలు పెట్టారు. జిల్లాలో కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గంలో టికెట్ ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నా.. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకుంటూ.. వ్యక్తిగతంగా అనుచరులతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో పోటీ పడుతున్న ఆశావహులు కార్యక్రమాల నిర్వహణకు డబ్బు వెచ్చించక తప్పడం లేదు.

పీఓపీ విగ్రహాలను నిమజ్జనానికి అనుమతించం

డీసీపీ శబరీష్



గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశమైన డీసీపీ శబరీష్ తదితరులు

కుత్బుల్లాపూర్: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీసీపీ శబరీష్ అన్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో వినాయక మండప నిర్వాహకులతో సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి డీసీపీ శబరీష్, ఏసీపీ రఘునందన్‌రావు హాజరై పలు సూచనలు చేశారు.

- ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీఓపీ)తో తయారు చేసే విగ్రహాలను నిమజ్జనానికి అనుమతించమని తెలిపారు. నిబంధనలను అతిక్రమించకుండా సహకరించాలని కోరారు. గణేశ్ మండపాల ఏర్పాటులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాటిని టర్పాన్లతో కప్పాలన్నారు.
- అదే విధంగా విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను పవర్‌బ్యాకప్‌తో ఏర్పాటు చేయాలని కోరారు. గణేశ్ విగ్రహం, లడ్డూ ప్రసాదం రక్షణకు నిర్వాహకులు ఇద్దరు వలంటీర్లను నిరంతరం మండపం వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా మండపాల వద్ద తక్కువ శబ్దంతో లౌడ్ స్పీకర్లను వినియోగించాలన్నారు.

కొంపల్లి మున్సిపాలిటీ శాయశక్తులా కృషి చేస్తున్నాం

మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో రూ.2.31 కోట్ల నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 6వ వార్డులోని నూజివీడు సీడ్స్ ప్రాంతంలో రూ.16లక్షలతో ఆర్‌సీసీ పైపులైన్ పనులు, 7వ వార్డులోని రమేశ్ రెసిడెన్సీ నుంచి మదీనా చికెన్ షాప్ వరకు రూ.18.00 లక్షలతో సీసీ రోడ్డు, రూ.10 లక్షలతో పార్క్ అభివృద్ధి పనులకు, 8వ వార్డులోని జయభేరి కాలనీలోని గ్రీన్ లాండ్స్ నుంచి ఆంజనేయస్వామి టెంపుల్ వరకు రూ.12 లక్షలతో ఆర్‌సీసీ పైపులైన్, 9వ వార్డులో రూ.10లక్షల నిధులతో ఓపెన జిమ్, 10వ వార్డులోని ఎంఆర్ రెసిడెన్సీ వద్ద రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్, అదే విధంగా 13వ వార్డులో రూ.56 లక్షలతో సీసీ రోడ్లు, 14వ వార్డులో రూ. 51 లక్షలతో సీసీ రోడ్లు, రూ.25 లక్షలతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనం, 17వ వార్డులో రూ.18 లక్షలతో స్టోమ్ వాటర్ డ్రైన్, 18వ వార్డులో రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులకు చైర్మన్ శ్రీశైలంయాదవ్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రత్లావత్ గంగయ్యనాయక్, కమిషనర్ శ్రీహరి, ఏఈ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలి



మాదిగలకు సంఘీభావంగా మాట్లాడుతున్న కేఎం ప్రతాప్

జీడిమెట్ల: పార్లమెంట్‌లో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి వారికి చట్టబద్ధత కల్పించాలని రంగారెడ్డి జిల్లా డీసీసీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేఎం ప్రతాప్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సిలివేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు. శుక్రవారం కేఎం ప్రతాప్ వారి దీక్షకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలన్నారు. మూడు దశాబ్దాలుగా మాదిగలు పోరాటం కొనసాగిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. మాదిగలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఆయన అన్నారు. దీక్షలో కుత్బుల్లాపూర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రాసమల్ల యాదగిరి, కాంగ్రెస్ నాయకులు జెస్సీ పాల్, ఇస్రం రమేష్, సలోమి, ఎస్తేరు రాణి, మట్ట నరసింహా, జాన్, త్రినేత్ర, వినోద్, వినయ్, ఈశ్వర్, మనోజ్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



హెచ్‌ఎంటీ స్థలంలో మెడికల్ కాలేజీకి కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధి పెద్దపీట వేసి ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట–షాపూర్‌నగర్ పైపులైన్ రోడ్డులోని హెచ్‌ఎంటీ స్థలంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, డిగ్రీ కళాశాల, బస్సు టెర్మినల్‌కు కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను కేటాయించడం గర్వకారణమన్నారు. రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

- కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్‌లో రూ.88.30 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ఎమ్మెల్యే మాజీ కార్పొరేటర్ గౌరీష్‌తో కలిసి ప్రారంభించారు. బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.
- ప్రగతియాత్రలో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రీనివాస్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్ ఉన్నారు.

కొత్తకుంట చెరువును కాపాడాలి

సుభాష్‌నగర్: గాజులరామారం సర్వే నం.23 పరిధి శ్రీకృష్ణనగర్ కాలనీలోని కొత్తకుంట చెరువును కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వారు ఫిర్యాదు చేశారు. కొత్తకుంటను కొందరు వ్యక్తులు మట్టితో పూడ్చి గదులు నిర్మిస్తున్నారని తెలిపారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ నాగమణి అధ్యక్షతన శుక్రవారం ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు, కుత్బుల్లాపూర్ మండలలోని ఎన్నికల సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ అధికారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి సైదులు ఆయన మాట్లాడుతూ.. ఫారమ్ 6, 7, 8 వెరిఫికేషన్‌ను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వాటి నిర్వహణకు సిద్ధంగా ఉండాలన్నారు. తహసీల్దార్ రహమాన్ ఖాన్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్కారు బడి విద్యార్థులను ఆదుకుంటాం



కొంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కేకేఎం ట్రస్ట్ అన్ని విధాలా ఆదుకుంటుందని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ట్రస్ట్ తరఫున కొంపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ప్రతి పాఠశాలలో కిట్లను పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువుల్లో రాణించి మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి, రాము గౌడ్, గిరివర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, శివాజీరాజా, సతీష్ సాగర్, సరిత, సంధ్య, బాలప్ప, శంకర్ నాయక్, నరసింహ, లక్ష్మి, ఆంజనేయులు, మోహన్‌రెడ్డి, నర్సింగ్ రావ్, శ్రీనాథ్, శ్రీకాంత్, ట్రస్ట్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసిన కార్మికులు

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని.. వారికి ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కొంపల్లిలోని ప్రతాప్ హెల్త్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ కార్మికులు శుక్రవారం శంభీపూర్ కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న తమను యాజమాన్యం అకారణంగా తొలగించిందని ఆయనకు తెలిపారు. దీంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. భౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, జెమ్మి దేవేందర్, భైరి ప్రశాంత్‌గౌడ్, కార్మికులు తదితరులు ఉన్నారు.

స్థలం మాదంటూ చదును.. కాదు మాదంటూ గొడవకు!



స్థల చదును చేయిస్తుండటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం

సుభాష్‌నగర్: భూముల ధరలు పెరిగిపోవడంతో ఖాళీ స్థలం కనబడితే చాలు ఇది తమదేనంటూ వాలిపోతున్నారు కబ్జాదారులు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో శుక్రవారం అలాంటి ఘటనే చోటుచేసుకుంది. బహదూర్‌పల్లి నుంచి బౌరంపేటకు వెళ్లే ప్రధాన రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 227/1 లో శుక్రవారం కొంతమంది వ్యక్తులు వచ్చి అందులో తమ 13 ఎకరాల స్థలం ఉందంటూ ప్రైవేట్ సర్వేయర్‌తో సర్వే నిర్వహించి జేసీబీతో స్థలం చదును చేయించారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పట్టాదారులు అక్కడికి చేరుకొని తమ తాతల నాటి కాలం నుంచి ఉన్న స్థలంలో మీరు రావటం ఏమిటని గొడవకు దిగారు. ఇరువురి మధ్య మాట పెరగడంతో మాజీ ప్రజాప్రతినిధి సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సదరు వ్యక్తులు అక్కడ నుంచి జారుకున్నారు.

సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న షీటీమ్ సభ్యులు

జీడిమెట్ల: అపురూపాకాలనీ టీవీఆర్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు షీటీమ్ అవగాహన సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా షీటీమ్ సభ్యులు మాట్లాడుతూ... ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో అకౌంట్ ఉంటే వెంటనే తొలగిపోవాలన్నారు. విద్యార్థులకు అవసరం లేని వాటిలోకి వెళ్లి లేనిపోని ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని సూచించారు. టెక్నాలజీని మనిషి ఎదుగుదలకు, విద్యావికాసానికి ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో డీపీలలో ఫొటోలను పెట్టుకోకపోవడం చాలా మంచిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్.. విక్రయదారుడి అరెస్ట్

11.6కిలోల గంజాయి మిక్స్‌డ్ చాక్లెట్లను స్వాధీనం



ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ నిందితుడు నందలాల్‌కుమార్



కుత్బుల్లాపూర్: చాక్లెట్‌ల రూపంలో మత్తు పదార్థాలను విక్రయిస్తున్న పాన్‌షాప్ నిర్వాహకుడిని మేడ్చల్ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వలపన్ని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 11.6 కిలోల గంజాయి మిక్స్‌డ్ చాక్లెట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం నిందితుడి వివరాలను మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మేడ్చల్ మండల పరిధిలోని బాసరగడిలో నందలాల్‌కుమార్(20) లతా పాన్ మహల్ పేరుతో పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. కాగా పాన్ షాప్ ముసుగులో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో శుక్రవారం పాన్‌షాప్‌పై దాడులు నిర్వహించారు.

- పాన్‌షాప్‌లో నిల్వ ఉంచిన 11.6 కిలోల గంజాయి మిక్స్‌డ్ 58 చాక్లెట్ ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడుతన్న నందలాల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బిహార్ నుంచి చాకెట్ల రూపంలో గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి మొబైల్, రూ.1100 నగదు, ఇతర ఆధారాలను సీజ్ చేశారు. ఎస్ఐ సలీమ్, సిబ్బంది సత్తార్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, చెన్నయ్యలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ అభినందించారు.

కార్మికులకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా

శ్రమశక్తి అవార్డు గ్రహీత మదన్‌గౌడ్



కార్మికుడు శర్మజిత్‌కు నష్ట పరిహారాన్ని అందజేస్తున్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్‌కేవీ పని చేస్తుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో విగ్నేష్ ఎలక్ట్రికల్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు శర్మజిత్‌కు విధుల్లో భాగంగా కాలు ఫ్యాక్చర్ అయింది. ఈ నేపథ్యంలో యాజమాన్యం రామ్‌రాజ్ ఆస్పత్రిలో చికిత్స చేయించి రూ.లక్ష వరకు వెచ్చించారు. ఆ తరువాత కార్మికుడి బాగోగులు పట్టించుకోకపోవడంతో బాధితుడు మదన్‌గౌడ్‌ను ఆశ్రయించగా యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చలు జరిపి రూ.1.5 లక్షలు, ఆస్పత్రి ఖర్చులు నిమిత్తం రూ. లక్ష మొత్తం రూ.2.5 లక్షలు ఇచ్చేందుకు ఒప్పించారు. సదరు మొత్తాన్ని శుక్రవారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో మదన్‌గౌడ్ బాధిత కార్మికుడికి అందజేశారు. కార్మికులకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. నాయకులు సుభాష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూఎంఎస్ ఆధునీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ కాలేజీల ఆన్‌లైన్ గుర్తింపు కొనసాగుతున్న యూఎంఎస్ విధానాన్ని ఆధునీకరించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణలు ఆన్‌లైన్ అఫిలియేషన్ ప్రక్రియను ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రక్రియ ద్వారా సులువుగా అనుబంధ కాలేజీ గుర్తింపు వ్యక్తుల ప్రమేయం లేకుండా పూర్తవుతుందని అన్నారు.